



మాట్లాడుతున్న ఎంపి డాక్టర్ సంజీవ్ కుమార్

పాత జాబితాకే గ్రీన్ సిగ్నల్

- అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి హైకోర్టు లైన్ క్లియర్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో చేపట్టిన అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టుల నియామకాల్లో భారీగా అవకతవకలు చోటుకున్నట్లు ఆరోపణలు రావడంతో దానిపై మెరిట్ జాబితాలో పేర్లు లేని వారు, ఉన్న వారు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పాత మెరిట్ జాబితాకే హై కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో నియామకాలపై మళ్లీ ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

అంగన్వాడీల్లో గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టుల నియామకానికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన రాత పరీక్షను నిర్వహించారు. కర్నూలు జోనల్ వ్యాప్తంగా 216 పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయగా 5వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ పోస్టులకు సంబంధించి భారీగా అవకతవకలు చోటు చేసుకున్నట్లు తీవ్ర స్థాయిలో ఆరోపణలు రావడంతో తమకు అన్యాయం జరిగిందని మెరిట్ జాబితాలో పేరు లేని వారు, తమ పేర్లు మెరిట్ జాబితాలో ఉన్నందున తమకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇరు గ్రూపులూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు పాత జాబితాలో పేర్లు ఉన్న వారికే నియామకాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తీర్పు ఇచ్చింది. తాము ఎంపిక అయినప్పటికీ, మెరిట్ లిస్ట్ లో పేర్లు ఉన్నప్పటికీ ప్రక్రియను నిలిపివేశారని మెరిట్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. మెరిట్ అభ్యర్థుల తరపున న్యాయవాది నర్రా శ్రీనివాస్ కోర్టులో వాదనలు వినిపించారు. విచారణ జరిపిన ధర్మాసనం గతంలో జరిగిన ఎంపిక ప్రక్రియ ద్వారా ఎంపికైన అభ్యర్థుల జాబితాకు లైన్ క్లియర్ చేసింది. కాగా అంగన్వాడీ సూపర్ వైజర్ల పోస్టుల ఎంపికలో తమకు అన్యాయం జరిగిందని మరికొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అయితే వారి పిటిషన్‌లను కొట్టివేస్తూ పాత ప్రక్రియను కొనసాగించాలని హైకోర్టు న్యాయమూర్తి స్పష్టం చేశారు. పాత నోటిఫికేషన్ ప్రకారమే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు తెలియజేశారు. దీంతో తమకు మళ్లీ అన్యాయం జరుగుతోందని కొందరు అభ్యర్థుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

పథకాల అమలులో అలసత్వం తగదు

- ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమల్లో అలసత్వం తగదనికర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కేంద్ర సమాచార ప్రసార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ పథకాల ఫోటో ఎగ్జిబిషన్‌ను కర్నూలు ఎంపి ప్రారంభించి మాట్లాడారు. అజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజల వద్దకు తీసుకొని వెళ్ళడానికి ఈ ఫోటో ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం చాలా బాగా అమలు అవుతుందన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పిఎంఇజిపి), స్టార్ట్ అప్ ఇండియా లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కర్నూలు జిల్లాకు సంబంధించి కేంద్ర పథకాలు ఏవైనా అమలు కాకుంటే తన దృష్టికి తీసుకొని వస్తే పక్కాగా అమలుకు అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ పనులకు సంబంధించి తాగునీటి కొరత లేకుండా ప్రతి ఇంటికి కొలాయి కనెక్షన్లు ఇస్తున్నారని అన్నారు. విద్య పరంగా అమలు చేస్తున్న పథకాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకొని వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కర్నూలు మేయర్ మేయర్ బివై. రామయ్య మాట్లాడుతూ స్వచ్ఛ్ సర్వేక్షణలో భాగంగా కర్నూలు జిల్లాను శుభ్రంగా ఉంచడానికి చాలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కేంద్ర సమాచార ప్రసార శాఖ జోనల్ డైరెక్టర్ శివహరి నాయక్, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతిక పద్ధతిలో రీ సర్వే

- కలెక్టర్ కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అత్యాధునిక సాంకేతికత పద్ధతిలో రీ సర్వే పనులను చేపట్టిందని కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ వీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాకు సంబంధించి 66 గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయ్యిందని భూ హక్కు పత్రాల పుస్తకాలు ప్రింటింగ్ కోసం ప్రధాన కార్యాలయానికి పంపామని, అవి రాగానే పంపిణీ ప్రారంభిస్తామన్నారు. రీ సర్వే పూర్తి చేసుకున్న భూములకు సంబంధించి భూ హక్కు పత్రాలు పంపిణీ వల్ల ఎలాంటి సివిల్ కేసులు తావు లేకుండా చూస్తామన్నారు. ఒక్కో కమతానికి ఒక యూనిక్ ఐడి ఇవ్వడం జరుగుతుందన్నారు. సదరు భూమికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడంతో పాటు భూమికి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. సదరు భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా భూప్రక్షాళన చేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన భూములను ఇతరులు ఆక్రమించుకొనే అవకాశం ఉండాదన్నారు. డిఆర్ఓ నాగేశ్వరరావు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి
- ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - కోడుమూరు

విద్యార్థులకు మంచి విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ పి.కోటేశ్వర రావు ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం కోడుమూరు మండలం గోరంట్ల మహాత్మా జ్యోతి బా పూలే బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎన్ని క్లాస్ రూములు ఉన్నాయి, ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, ఎంతమంది టీచర్లు ఉన్నారు, ఈఏడాది ఎంత మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారు, గతేడాది 10వ తరగతిలో ఎంతమంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ రయీస్ అహ్మద్‌ను ఆరా తీశారు. అనంతరం హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులకు ఎక్సర్‌సైజ్, స్టడీ అవర్స్, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, రాత్రి సమయంలో స్టడీ అవర్స్ వివరాలపై ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. వసతి గృహానికి ప్రహరీ నిర్మించాలని సూచించారు. నాడు-నేడు కింద మంజూరయిందని, త్వరలోనే నిర్మిస్తామని కలెక్టర్ తెలిపారు.



ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

అనంతరం వంట గదిని పరిశీలించి భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల వద్ద కూర్చుని కలెక్టర్ భోజనం చేశారు. భోజనం రుచిగా పెడుతున్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. రుచిగా ఉంటోందని విద్యార్థులు తెలిపారు. వసతి గృహం పొలాలకు దగ్గరలో ఉన్నందున ఆవరణలోకి పాములు, తేళ్లు వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పాములు, తేలు కాటుకు సంబంధించిన మందులు, ఇంజెక్షన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. బీసీ వెల్ఫేర్ అధికారి వెంకట లక్ష్మమ్మ, కోడుమూరు తహశీల్దార్ శేష ఫణి పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్ష పదవి నుంచి వైదొలగిన బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



వైసిపి జిల్లా అధ్యక్ష పదవి నుంచి వైదొలగినట్లు మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి తన వంతు సేవలు అందించానని పేర్కొన్నారు. గతంలో కూడా జిల్లా అధ్యక్షులుగా జిల్లా కేంద్రంలో ఉండే మేయర్ బివై.రామయ్యకు ఇవ్వాలని కోరామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డికి తెలిపామన్నారు. తాత్కాలికంగా కొన్ని రోజులు కొనసాగాలని కోరడంతో జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం బాధ్యతలను బివై.రామయ్యకు ఇవ్వడం స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులుగా మద్దతును ఇచ్చి సహకరించిన జిల్లా ప్రజలకు, ఎమ్మెల్యేలకు, వైసిపి సమన్వయ కర్తలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

సలీమ్ శంకర్ తోటలో

తహ-శీల్దార్ మందు, విందు

- అదే బాటలో ఆర్ఐ, విఆర్ఒలు, సర్వేయర్లు
- తరచూ విధుల్లోనే ఈ తతంగం

ప్రజాశక్తి- సి బెళగల్

విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు, విద్యార్థులకు, రైతులకు సులువైన సేవలు అందించాల్సిన సి.బెళగల్ తహశీల్దార్ తరచూ సలీమ్ శంకర్ తోటలో మందు, విందుతో గడుపుతుండడం చర్చనీయాంశమైంది. అదే బాటలోనే ఆర్ఐ, విఆర్ఒలు, సర్వేయర్లు, సిబ్బంది ఉండడం, వారితోనే తరచూ సమయాన్ని గడుపుతుండడం మరీ విడ్డూరంగా ఉంది. సచివాలయ ఉద్యోగులు, సర్వేయర్లు 16 మంది, విఆర్ఒలు ముగ్గురు ఉండగా రెగ్యులర్ అయ్యారని, వారంలో ముగ్గురు చొప్పున మందు పార్టీలకు రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నారు. గత విఆర్ఒలు 13 మంది కూడా ఇదే తోటనే విహారాలకు నిలయంగా మార్చుకొన్నారు. రోజు మార్చి రోజు డ్యూటీ సమయంలోనే ఈ తతంగం కొనసాగిస్తుండడంతో ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేశారు. కీలక సమస్యలపై, అత్యవసర సేవల కోసం ప్రజలు, రైతులు, విద్యార్థులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా ఫోన్లు చేసి కలుస్తామని అడిగితే మీటింగ్‌లో ఉన్నామంటూ బుకాయిస్తున్నారు. వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే తహశీల్దార్ సీట్లో కూర్చున్నప్పటికీ ప్రతి సోమవారం స్పందనతో, మధ్యమధ్యలో వీడియో కాన్ఫరెన్స్‌లంటూ ప్రజలకు సేవలందని దుస్థితి నెలకొంది. ఒకవేళ ప్రజలకు పనులు కావాలంటే చేయి తడపనిదే ఏ పని జరగదు.. ఏ ఫైలూ కదలదు. తహశీల్దార్ అసమర్థతకు ముక్కల గట్టులో, మల్లప్ప గట్టులో, బురాన్ దొడ్డి, క్రిష్ణదొడ్డి గట్టులో ప్రభుత్వ భూములన్నీ ఆక్రమణకు గురయ్యాయి. వందల ఎకరాల్లో సంపన్న వర్గాలు పొలాలు, ఇళ్ల కోసం ఇష్టమొచ్చినంత స్థలాలు ఆక్రమించేశారు. బెళగల్, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి కొండల్లో ఎర్రమట్టి, నదీతీరం వెంట ఇసుక వంటివి యథేచ్ఛగా తరలిపోతున్నా పట్టని స్థితి నెలకొంది. ప్రధానంగా సి.బెళగల్ నడిబొడ్డులో ఏళ్లుగా మార్కెట్ కోసమని వదిలిన రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఒక వర్గం మెప్పుకోసం రికార్డులు మార్చి అండగా నిలిచారు. అదే స్థలంలో ఓ అభాగ్యురాలు లింగమ్మ మూడు సెంట్లు కొన్నామని ఆధారాలు చూపిస్తే ఏమాత్రం స్పందన చూపకపోవడం శోచనీయం. ఇలాంటివెన్నో సమస్యలున్నాయి. మండలంలో అనేకం రెవెన్యూ సమస్యలు తాండవించినా క్షేత్రస్థాయిలో తహశీల్దార్ దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. అదే సలీమ్ శంకర్ చేతిలో అన్యాక్రాంతం అయిన భూములను కాపాడాలని వామపక్ష పార్టీలు ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా.. ఏ రోజు తహశీల్దార్ గాని సిబ్బంది గాని సర్వేలు చేపట్టి స్వాధీనం చేసుకొన్న పాపానలేదు. అదే మందు, విందులకైతే ఈ తోటలో వేళలు గడపటం ఆశ్చర్యానికి గురిచేస్తోందని, ఇక చర్యలు చేపట్టేదేవరో అంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సలీమ్ శంకర్‌తోటలో విందులో పాల్గొన్న తహశీల్దార్, ఇతర సిబ్బంది



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎన్.శమంతకమణి

బాక్సింగ్‌లో నైపుణ్యం ప్రదర్శించాలి

ప్రజాశక్తి- కర్నూలు స్పోర్ట్స్

యుద్ధ క్రీడ లాంటి బాక్సింగ్‌లో నైపుణ్యతను ప్రదర్శించాలని నగరూరు సుబ్ర మణ్యం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎన్.శమంతకమణి అభిప్రాయ పడ్డారు. బుధ వారం స్థానిక కిడ్స్ వరల్డ్‌లోని రోశయ్య కమ్యూనిటీ హాల్లో నగర అంతర్ పాఠశాలల బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా, ఎన్. శమంతకమణి జిల్లా బాక్సింగ్ అసోసి యేషన్ కార్యదర్శి పి. విజయ్ కుమార్ , సెపక్ తక్ర రాష్ట్ర కార్యదర్శి జి. శ్రీని వాసులు, రోలర్ స్కేటింగ్ జిల్లా కార్యదర్శి పి.సునీల్ కుమార్ , బాక్సింగ్ క్రీడా కారులను పరిచయం చేసుకోని రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. శమంతకమణి మాట్లాడుతూ పిల్లలు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించాలన్నారు. నిత్యం సాధన చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లాబాక్సింగ్ అసో సియేషన్ కార్యదర్శి పి.విజయ్ కుమార్ మాట్లాడుతూ బాక్సింగులో పాల్గొన్న వారికి భవిష్యత్తులో స్పోర్ట్స్ కోట రావడంతో పాటు విద్యార్థులు చురుగ్గా ఉంటారని తెలిపారు. బాక్సింగ్ శిక్షకులు టి. వెంకటేశ్వర్లు, బి నాగరాజు, కె .వెంకటేష్ , సెపక్తక్రా స్టేట్ సెక్రటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ పోటీలకు నగరంలోని పలు పాఠశాల నుండి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత

- అదనపు గదులకు ఎమ్మెల్యే భూమి పూజ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే విద్యా వ్యవస్థకు ప్రాధాన్యత ఇచ్చినట్టు ఏ రాష్ట్రంలో లేదంటూ కోడుమూరు శాసనసభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలు మండలం రుద్రవరంలో మండల ప్రాథమిక పాఠశాలలో మనబడి నాడు నేడు నిధుల తో రూ. 54 లక్షలతో అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జడ్పిటిసి ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహెమ్యా, సర్పంచ్ మధుసూదన్, విద్యాసాగర్ వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్లు శేశిరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఎంపీటీసీ హనుమంతు, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు, మాజీ మార్కెట్ డైరెక్టర్ పసుపల బాషా, చంద్ర, ఎర్రమల ప్రవీణ్ పాల్గొన్నారు.

కొత్త మెనూను రద్దు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మధ్యాహ్న భోజన పథకం కొత్త మెనూను రద్దు చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం గౌరవాధ్యక్షులు జె. నాగేశ్వరరావు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భారతి డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక కర్షక భవన్‌లో మధ్యాహ్న భోజన పథకం కర్నూలు నగరం కార్మికుల ముఖ్య కార్యకర్తల సమావేశం లీలావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులకు పిల్లలు అలవాటు పడలేకపోతున్నారని, భోజనం తినలేక ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని అన్నారు. హాట్ పొంగలిని పిల్లలు తినడం లేదని వివరించారు. పప్పు ఆకుకూర మార్చారని తెలిపారు. సాంబార్, బాత్ ఆకుకూర అన్నం ఇలా మార్చడం సరికాదని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పాఠశాలల విలీనం పేరుతో కార్మికులను ఇంటికి పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలలో పని భారం పెరిగిందని, 9 ,10 తరగతి లకు వంట చేస్తున్న వారికి కనీస వేతనం రూ.6000 ఇవ్వాలని కోరారు. కొత్త మెనూ ప్రకారంగా ప్రతి విద్యార్థికి రూ.20 ఇవ్వాలని, కార్మికులకు ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని అన్నారు. నూతన టెక్నాలజీ యాప్‌ల ద్వారా ప్రతి వస్తువును డిజిటల్‌లో పెట్టి తూకాలు వేసి ఇవ్వాలని ప్రభుత్వ ఆలోచన ఉందని, ఈ ఆలోచన విరమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా సహాయకుల సంఖ్యను పెంచాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు శ్రీవాణి, అంబుబాయి, లలితమ్మ, రజియా, జహారాబీ, ఏస్తేరమ్మ, సరోజమ్మ, హైమావతి, పద్మ, అనసూయ ,లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఈ బిల్లుతో ఇల్లెలా సాధ్యమంటే పోలీసులకు ఫిర్యాదు చేశారు

ప్రజాశక్తి సి బెళగల్: పెరిగిన ధరలతో ఇల్లు కట్టుకోవాలంటే రూ.1,80,000 ఏమూలకు సరిపోదని అధికారులను ప్రశ్నించినందుకు సి.బెళగల్ ఎంపిడిఒ రాముడు, అసిస్టెంట్ ఇంజినీర్ శాంతిలు లబ్ధిదారులైన ఇందిర, ఆమె భర్త నతానియేలుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశేషమేమంటే డిసెంబర్ 21 నాటికి ఇల్లు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అధికారులు కూడా సవాలుగా తీసుకోని లబ్ధిదారులను ఒత్తిళ్లకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా బురాన్ దొడ్డిలో ఆ దంపతులకు హెచ్చరించగా ఈ బిల్లుకు ఇల్లు ఎలా కట్టాలని, రూ.నాలుగు లక్షల నుంచి ఐదు లక్షలు ఖర్చు చేస్తేతప్ప ఇళ్ల కట్టలేమని అన్నారు. స్పందించిన అధికారులు తీసుకున్న సిమెంట్, వెలుగు డబ్బులు రూ.35 వేలు ఉన్న ఫలాంగా తిరిగివ్వాలని ఆదేశించారు. ఇస్తామనడంతో గతంలో కూడా అనేక సమస్యలపై నిలదీస్తున్నారన్న అక్కసుతో అసభ్యకరంగా మాట్లాడారంటూ లబ్ధిదారులపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ దంపతులను బుధవారం స్టేషన్లో ఉంచి కేసునమోదు చేసేందుకు అత్యుత్సాహం ప్రదర్శించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-తుగ్గలి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే కె. శ్రీదేవి అన్నారు. బుధవారం తుగ్గలి మండలం అమీనాబాద్‌లో స్థానిక నాయకులు రామాంజనేయులు యాదవ్, సోమశేఖర్ చౌదరి, హనుమంతు ఆధ్వర్యంలో గడపగడప మనప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందరికి సంక్షేమ పథకాలు అందే విధంగా చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జడ్పిటిసి పులికొండ నాయక్, సింగిల్ విండో అధ్యక్షులు అట్లా గోపాల్ రెడ్డి, వైస్ఎంపిపి మల్లికార్జునరెడ్డి, వైసిపి నాయకులు జగన్నాథరెడ్డి, రాతనమోహన్ రెడ్డి, జిట్టానగేష్ యాదవ్, మాజీ జెడ్పిటిసి నారాయణ నాయక్, మండల్ కోఆప్షన్ సభ్యులు చాంద్ బాషా పాల్గొన్నారు.



యాంటి ర్యాగింగ్ ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్ : కర్నూలు వైద్య కళాశాలలో విద్యార్థులు ర్యాగింగుకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ జిజిహెచ్ సూపరిన్‌టెండెంట్ నరేంద్రనాథ్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం కర్నూలు వైద్య కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీ నుండి యాంటి ర్యాగింగ్ ర్యాలీని డాక్టర్ జి.నరేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే సీనియర్ విద్యార్థులపై తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని అన్నారు. కొత్తగా చేరిన వైద్య విద్యార్థులను ఎవరైనా ర్యాగింగ్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాగింగ్‌పై కళాశాల హాస్టళ్లలో ఇప్పటికే అవగాహన కల్పించామని, కాలేజీ యాంటి ర్యాగింగ్ కమిటీ నిరంతరం నిఘా పెట్టినట్లు వివరించారు. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర రెడ్డి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ, డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ వెంకట రంగారెడ్డి, నోడల్ ఆఫీసర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగంజన్, డాక్టర్ కిరణ్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్


కర్నూలు నగర పరిధిలో 3వ వార్డు బండిమెట్ట లో ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారని, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముహమ్మద్ షరీఫ్, నగర నాయకులు కె. రాజగోపాల్, డి.పార్వ తయ్య తదితరులు కలిసి వీధులలో పర్యటించారు. ఏ వీధి చూసిన డస్ట్ కుప్ప లతో రోడ్డుకి అడ్డదిడ్డంగా ఉన్నాయి. దీని వల్ల ప్రజలకు రాకా పోకలకు ఇబ్బంది కలుగుతుందని, వారు విమర్శించారు. సామూహిక మరుగుదొడ్ల లో బేసిన్ లు బ్లాక్ అయి కంపు కొడుతున్నాయని, లెట్రిన్‌లో దాదాపు 10 కొళాయిలు పని చేయడం లేదని, లైట్లు వెలగడం లేదని, ఆరు డోర్లు లేవని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పాలకసంస్థ అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. వర్మ కాంపౌండ్ ప్రక్కన గోడ కూలి ఒకరు మరణించారని, ఆ గోడ తిరిగి నేటికీ కట్టించలేదని అన్నారు. నగర కమిషనర్‌కు ప్రజల ప్రాణాలంటే, ఆరోగ్యాలంటే ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సచివాలయం ముందు పెద్ద ఎత్తున్న ధర్నా చేస్తామని హెచ్చరించారు. వార్డు కార్యదర్శి షేక్షావలి, రాజు, అబ్దుల్లా, జావీద్,మహాబాషా పాల్గొన్నారు.



సమస్యలను పరిశీలిస్తున్న సిపిఎం నగర నాయకులు

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: సచివాలయాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సేవలు అన్ని ప్రజల వద్దకు దిగివచ్చాయని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హఫీస్ ఖాన్ అన్నారు. బుధవారం కర్నూలు నగరం లోని 9వార్డులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. వార్డులో ప్రజలు చిన్న చిన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటిని అక్కడికక్కడే అధికారులకు తెలిపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ గతంలో టిడిపి నాయకులు ఓట్ల కోసం మాత్రమే ప్రజల వద్దకు రావడం జరిగేదని, గెలిచాక పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైసిపి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తుందన్నారు. వచ్చే 2024 ఎన్నికలలో కూడా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. స్థానిక వార్డు నాయకులు నవీన్ కుమార్, తబ్రేజ్, రాజశేఖర్, విజయ్, మజీద్‌ఖాన్, సలాం భాయ్, అబ్దుల్లా, కేదార్, అమీర్, వలి, ఇంతియాజ్, కిషోర్, అక్బర్, కవిత, శోభారాణి, అరుణ, విమల, గౌస్ భాయ్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్, మున్సిపాలిటీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఆర్‌పిలు, ఒబిలు విద్యుత్ సిబ్బంది, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న హాఫీజ్‌ఖాన్

ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వద్దు

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - హొళగుంద


రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

జగనన్న ఇళ్ల నిర్మాణ పనుల్లో అలసత్వం వీడాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంపిడిఒ సమావేశ భవనంలో ఇళ్ల నిర్మాణ పనులపై మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హొళగుందతో కొన్ని గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన స్టీలు, సిమెంటు, ఇసుక వంటివి అందించాలని తెలిపారు. లబ్ధిదారులు అధికారులకు సహకరిస్తే రెండు నెలల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించవచ్చని చెప్పారు. అంతకుముందు సులువాయి గ్రామంలో పాఠశాలను, సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం అంగన్వాడీ టీచర్లతో మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించాలని తెలిపారు. తహశీల్దార్ హుస్సేన్ సాబ్, ఎంపిడిఒ దాసు నాయక్, డిప్యూటీ తహశీల్దార్ దీప, హౌసింగ్ ఎఇ రవి వర్మ, పిఆర్ ఎఇ సోమప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మనోహర్ పాల్గొన్నారు.

జిఒ 53ను రద్దు చేయాలి

- దళిత, ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లను ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చిన జిఒ 53ను రద్దు చేయాలని నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో దళిత, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పూలే, అంబేద్కర్ ఐడియాలజీ కన్వీనర్ ఎసి.దేవదానం, కెవిపిఎస్ నాయకులు ఆనందరావు, ఆంథోని, బి.సంజీవ్, జై భీమ్ ఎంఆర్‌పిఎస్ నాయకులు హనుమన్న, బుజ్జిబాబు, మాల మహానాడు నాయకులు హుస్సేని, మధుబాబు, విద్యార్థి సంఘాల నాయకులు అజిత్, ఉదయ్, రాజీవ్, సురేష్, పూలే, అంబేద్కర్ సొసైటీ ఎస్.నరసన్న, జయరాజు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పందికోన ఈరన్న, బాలరాజు పాల్గొన్నారు.

కంది సంరక్షణకు జాగ్రత్తలు అవసరం : ఎఒ

పెద్దకడబూరు : కంది పంట సాగులో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎఒ వరప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని గవిగట్టు, పీకలబెట్ట గ్రామాల శివారులో సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కంది పంటలో మారుక మచ్చల పురుగు, కాయ, ఈగ ఉధృతి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వాటి నుంచి పంటను కాపాడుకోవడానికి లూఫె నురాన్ అనే మందును ఎకరాకు 200 మిల్లీలీటర్లు (లేదా) డెల్టా మెత్రిన్ అనే పురుగు మందు ఎకరాకు 180 మిల్లీలీటర్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు లోకేష్, రైతులు పాల్గొన్నారు.

మార్చి చివరి వరకు సాగునీటి విడుదల కోసం

28న రోడ్ల దిగ్బంధనం

- హంద్రీనీవా సాగునీరు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం - అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ


సమావేశంలో మాట్లాడుతున్న వీర శేఖర్

హంద్రీనీవా సాగునీటి రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 28న రోడ్ల దిగ్బంధనం చేపడుతున్నట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. బుధవారం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సిపిఐ మండల కార్యదర్శి నరసరావు అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, సిపిఐ జిల్లా నాయకులు మద్దిలేటి శెట్టి, టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, నాయకులు ఉచ్చీరప్ప, లోక్‌సత్తా నాయకులు రాందాస్ గౌడ్, ఎంఆర్‌పిఎస్ నాయకులు లక్ష్మన్న, సుధాకర్, జనసేన నాయకులు నాగరాజు, ఖలీల్ మాట్లాడారు. మార్చి చివరి వరకు నీరిస్తామని ఒకవైపు మంత్రి ప్రకటన చేసినప్పటికీ, హంద్రీనీవా అధికారులు మాత్రం డిసెంబర్ వరకే నీటి విడుదల అంటూ ఉత్తర్వులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. మండలంలో రబీ సీజన్‌కు సంబంధించి వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారని చెప్పారు. డిసెంబర్ వరకే సాగునీరు విడుదల అని హంద్రీనీవా అధికారులు జారీ చేసిన జిఒ చూస్తుంటే పంట చేతికందే వరకు నీళ్లు అందుతాయో లేదో అని తెలిపారు. రబీకి సంబంధించి వేరుశనగ విత్తనాలను వ్యవసాయ అధికారులు ముమ్మరంగా పంపిణీ చేయడంతో పంటలు సాగు చేసినట్లు చెప్పారు. మండల రైతులకు మంత్రి ఇచ్చిన హామీ మేరకు మార్చి చివరి వరకు హంద్రీనీవా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష నాయకులు రవికుమార్, మొలకన్న, రామారావు నాయుడు, సూరి, శ్రీరాములు, యూసుఫ్, నెట్టేకల్, సుల్తాన్, బడేసాహెబ్, భాస్కర్, మధు, వెంకటరాముడు, మునయ్య పాల్గొన్నారు.

ఆయకట్టు రైతు కన్నీరు

- అరకొరగా సాగునీరు, తెగుళ్ల బారిన పంటలు
- ఎండుతున్న పంటలు... ఆందోళనలో రైతులు
- ఆలూరు బ్రాంచి కాలువ పరిధిలో 10 వేల ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి - చిప్పగిరి

పంటలకు అరకొరగా సాగు నీరు అందుతుండడం, తెగుళ్ల బారిన పడుతుండడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. నీరు లేక పంటలు ఎండుతుండడంతో 10 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లుతోంది. ఆలూరు ఉప కాలువ పరిధిలోని (ఎబిసి) సాగు చేసిన పంటలకు అరకొరగా నీరు అందడంతో తెగుళ్ల సోకి పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు.


సకాలంలో నీరు అందక ఎండుతున్న వరి

ఎబిసి కాలువ పరిధిలో 14,265 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఈ కాలువకు హంద్రీ కాలువ ద్వారా సాగునీరందిస్తున్నారు. కాలువ పరిధిలో మరో 15 వేల ఎకరాల్లో నాన్ ఆయకట్టు సాగుతుంది. ఈ కాలువ పరిధిలో చిప్పగిరి, ఆలూరు, హాలహర్వి మండలాలకు చెందిన 20 గ్రామాల రైతులు హంద్రీనీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. చిప్పగిరి మండలంలో చిప్పగిరి, ఏరూరు, డేగలపాడు, బెల్డోన, తిమ్మాపురం, రామదుర్గం, బంటనహాల్ గ్రామాల్లో 10 వేల ఎకరాల్లో మిరప, వరి, పత్తి, జొన్న పంటలను సాగు చేశారు. హాలహర్వి మండలంలోని ఆరు గ్రామాల్లో 10 వేల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. ఆలూరు మండలంలోని హత్తి బెళగల్, అగ్రహారం గ్రామాల్లో 5 వేల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. ఆయా ప్రాంతాల్లో సరైన వర్షాలు కురవకపోవడం, హంద్రీనీవా కాలువకు దాదాపు 15 రోజుల పాటు నీరు నిలిచిపోవడం తదితర కారణాల వల్ల రైతులు సాగునీటిని సకాలంలో అందించలేకపోయారు. దీనికి తోడు వాతావరణ పరిస్థితులు, పురుగులు ఆశించడం, తెగుళ్లు సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తి ఇప్పటికే దాదాపు 50 శాతం పంట దిగుబడి కోల్పోగా నల్లి పురుగు సోకడంతో రూ.లక్షల్లో నష్టాన్ని మూట కట్టుకున్నారు. నష్టపోయిన తమను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

రూ.9 లక్షల పెట్టుబడి నష్టం

- చెరుకూరి రాధాకృష్ణ, రైతు, ఏరూరు



40 ఎకరాల్లో వరిని సాగు చేశాను. దీనికోసం రూ.9 లక్షల పెట్టుబడి పెట్టాను. పైరు కాపు బాగా ఉన్న సమయంలో హంద్రీనీవా కాలువకు పది రోజులపాటు నీరు నిలిచిపోవడంతో పంటలు ఎండిపోయాయి. తర్వాత కాలువకు నీరు వదిలినా ప్రయోజనం లేకపోయింది. సకాలంలో వర్షాలు లేకపోవడం కూడా పంట నష్టానికి మరో కారణమయింది. ప్రభుత్వం రైతులను ఆదుకొని పంట నష్టపరిహారాన్ని అందించాలి.

మిరపకు నల్లి పురుగు

- రైతు గోపాల్



నేను నాలుగెకరాల్లో బ్యాడిగ మిరప, 8 ఎకరాల్లో వరి సాగు చేశాను. మిరపకు నల్లి పురుగు సోకింది. పంట పూర్తిగా దెబ్బతినింది. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. సకాలంలో నీరు లేకపోవడంతో వరి పంట నష్టపోయింది. రూ.4 లక్షల వరకు పెట్టుబడి కోల్పోయాం. ప్రభుత్వం రైతులకు బీమాతో పాటు నష్టపరిహారం అందించాలి.


ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

మౌలిక వసతులు కల్పించాలి

- సచివాలయం ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు సచివాలయాన్ని ముట్టడించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీల కోసం నిధులు మంజూరయినప్పటికీ పనులు మొదలు పెట్టలేదని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని చెప్పారు. డ్రెయినేజీ నీరు రోడ్లపైనే పారుతోందని, ఎంతోమంది కింద పడిన పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే 6వ వార్డులో సిసి రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభించాలని, లేకపోతే సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆమె హామీఇచ్చారు. గ్రామస్తులు కుల్లి కాశీం, మడికి బాష, అల్లాబకాష్, రాజ బకాష్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారమివ్వాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - మంత్రాలయం

నకిలీ విత్తనాల ద్వారా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో నకిలీ పత్తి విత్తనాలు సాగు చేసి రైతులు నష్టపోయారని తెలిపారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టారని, కనీసం విత్తనాల ఖర్చు కూడా రాని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇప్పటికీ పలుమార్లు డీలర్ల దృష్టికి రైతులు తీసుకెళ్లినా నష్టపరిహారంపై స్పష్టత లేదని తెలిపారు. మండలంలోని రచ్చుమర్రి, సూగూరు తదితర గ్రామాల రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు నష్టం కలిగించిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ చంద్రశేఖర్, ఎఒ జీరా గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, వ్యకాస నాయకులు ప్రాణేష్, రైతులు తిప్పయ్య, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు ఉచ్చీరప్ప

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు ఉచ్చీరప్ప డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బసరకోడు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కెవిపిఎస్ 4వ రాష్ట్ర మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కెవిపిఎస్ 4వ రాష్ట్ర మహాసభలను ఈనెల 28, 29న కర్నూలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా కేరళ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కె.రాధాకృష్ణ, డిఎస్ఎంఎం జాతీయ అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, జాతీయ కార్యదర్శి జె.జాన్ వెస్లీ, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఓ.నల్లప్ప, ఆండ్రా మాల్యాద్రి హాజరవుతున్నారని చెప్పారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. గ్రామస్తులు కుమార్, రంగస్వామి, తిమ్మన్న, పరమేష్, వీరేష్ పాల్గొన్నారు.

రూ.1కే టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రంలో 300 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లకు తమ ప్రభుత్వం రూ.1కే రిజిస్ట్రేషన్ చేస్తోందని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం 8వ వార్డులోని 120 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిచేసి ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు పాల్గొన్నారు.

4న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- ప్రిన్సిపల్ సాగరిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్



మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో డిసెంబర్ 4న ఉదయం 11.30 గంటలకు ఆన్‌లైన్ (వర్చువల్)లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.సాగరిక తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడారు. ప్రతేడాది డిసెంబర్ మొదటి ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10, 12వ తరగతుల విద్యార్థులకు మొదటి ప్రీ బోర్డు పరీక్షల దృష్ట్యా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆన్‌లైన్ (వర్చువల్)లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులకు ఆహ్వాన పత్రిక, ఆన్‌లైన్ (వర్చువల్) లింక్ విద్యాలయ వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. విద్యాలయ వెబ్ సైట్ : (https://navodaya.gov.in/nvs/nvs-school/KURNOOL/en/home) పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎంపిడిఒ కార్యాలయానికి విద్యుత్ కట్

- విడ్డూరంగా ఉంది : ఎంపిడిఒ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

మండల పరిషత్ కార్యాలయానికి విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేసిన సంఘటన మండలంలో సంచలనంగా మారింది. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్ ఎఇ నరసన్న తెలిపారు. ఈ విషయంపై ఎంపిడిఒ జగన్‌మోహన్ రెడ్డిని ప్రశ్నించగా... విద్యుత్ శాఖ అధికారుల తీరు విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. మండలంలోని పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే ఎంపిడిఒ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపేయడం తగదన్నారు. పిఎ వెంకటరామ్ రెడ్డి అక్కడే ఉన్నా సమయంలో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కట్ చేయడం అక్కడున్న వారందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ విషయంపై మండల విద్యుత్ ఎఇ నరసన్నను వివరణ కోరగా... పంచాయతీ బిల్లులు బకాయిల కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపిడిఒ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపేసినట్లు తెలిపారు.



ఎంపిడిఒ కార్యాలయం

రైతు రోషన్ జమీర్ కుటుంబానికి

మార్కెట్ ధర ప్రకారం పరిహారమివ్వాలి

- ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - నందవరం

2013 భూసేకరణ చట్టం అమలు చేస్తూ, ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నాగలదిన్నె గ్రామ రైతు రోషన్ జమీర్ కుటుంబానికి నష్టపరిహారం అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం రోషన్ జమీర్ కుటుంబ సభ్యులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1995లో బ్రిడ్జి నిర్మాణానికి స్థలం ఇచ్చినప్పుడు రోషన్ కుటుంబానికి నష్టపరిహారం, పరిహారంతో పాటు ఉద్యోగం ఇస్తామని హామీఇచ్చారని తెలిపారు. 2009 వరదల్లో బ్రిడ్జి కొట్టుకుపోగా 2వ సారి బ్రిడ్జి నిర్మాణానికి మరోసారి స్థలం ఇచ్చిన రైతుతో మాట్లాడి ధర నిర్ణయించక పోగా, మార్కెట్ ధర ప్రకారం రూ.కోటి ఉంటే రూ.3.70 లక్షలు అందించారని చెప్పారు. 2013 చట్టం ప్రకారం రైతుకు నష్టపరిహారం అందించి పనులు ప్రారంభించాలని ఉన్నా పట్టించుకోకుండా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడం అన్యాయమని విమర్శించారు. రైతుకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా భూమిని స్వాధీనం చేసుకుని, దౌర్జన్యంగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం అన్యాయమన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారం సరిపోదని కుటుంబ సభ్యులతో శాంతియుతంగా ధర్నా చేస్తుంటే వారిని అరెస్టు చేసి, జైలులో నిర్బంధించడం దారుణమని తెలిపారు. మహిళలని కూడా చూడకుండా నిర్బంధించిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని రోషన్ జమీర్ కుటుంబానికి న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ రఘువీరాకు వినతిపత్రం అందజేశారు. రైతు కుటుంబ సభ్యులు సలీమ్, రోషన్ జమీర్, అబ్దుల్లా లతీఫ్, మహబూబ్ బాష, జిలాన్ బాష, షాహిన్, సెర్వన్ భాను, నసీం, ఎపి రైతు సంఘం నాయకులు హనుమంతు, లక్ష్మీ నరసయ్య, మండల నాయకులు దేవపుత్ర, స్వామిదాసు, ఎల్లేష్, నరసింహులు, ప్రభాకర్, నల్లన్న, కృపయ్య, శ్రీరాములు, రాజు, లక్ష్మన్న, జయరాజు పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు పి.ఈరన్న డిమాండ్ చేశారు. బుధవారం పెద్దకడబూరులో సిపిఎం మండల కార్యదర్శి ఈడిగ తిక్కన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరన్న మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కార్మికుల నడ్డి విరిచే చట్టాలు తీసుకు రావడం వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. కార్మికులకు నష్టం చేకూర్చే చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం సీనియర్ నాయకులు పరమేష్, వ్యకాస మండల అధ్యక్షులు హనుమంతు, మండల కార్యదర్శి శ్రీనివాసులు, కెవిపిఎస్ మండల కార్యదర్శి ఆనంద్ రాజు, డివైఎఫ్ఐ మండల నాయకులు సద్దాం హుస్సేన్, గ్రామ సేవకులు భీమన్న, హేమావతి, బజారి, హుస్సేని, ఆవాజ్, సిపిఎం మండల నాయకులు బాష, సిఐటియు మండల నాయకులు చిరంజీవి, ఆర్‌డబ్ల్యుఎస్ వడ్డే లక్ష్మన్న పాల్గొన్నారు.

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయరాదు

ఆదోని : కంటికి సోకే జబ్బులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో చికిత్సలు చేయించుకుని చూపును మెరుగుపరచుకోవాలని లయన్స్ క్లబ్ ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆదోని లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ ఉషా రావు నిర్వహించారు. లయన్స్ క్లబ్ మెంబర్ ఉమా కోటేశ్వరి, డాక్టర్లు కృష్ణమూర్తి, డాక్టర్ ఉషా రావు సహకారంతో 40 మందికి కంటి అద్దాలు అవసరమైతే దాదాపు రూ.20 వేల విలువ చేసే కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోషకాహారం లోపం వల్ల వయస్సుతో నిమిత్తం లేకుండా కంటి చూపు మందగించే అవకాశం ఉందని తెలిపారు. టివి ఎక్కువ చూడడం, సెల్‌ఫోన్, కంప్యూటర్ చూడడం వల్ల కూడా కంటిచూపుపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని వివరించారు. ఐఎంఎ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ కృష్ణమూర్తి, ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ ఉషా రావు, ఐఎంఎ సెక్రటరీ కిరణ్ కుమార్, లయన్స్ క్లబ్ ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, సెక్రటరీ వెంకటేష్ ప్రసాద్, ఇసి మెంబర్స్ గోవిందరావు, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి - హాలహర్వి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. బుధవారం మండలంలోని విరుపాపురం గ్రామంలో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం 'గడపగడపకు మన ప్రభుత్వం' చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో రైతులకు, సంక్షేమానికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు. అనంతరం ప్రజల సమస్యలు, పథకాలు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. గుమ్మనూరు నారాయణస్వామి, వైస్ ఎంపిపి నాగేష్, మండల కన్వీనర్ భీమప్ప చౌదరి, జడ్‌పిటిసి లింగప్ప, సొసైటీ ఛైర్మన్ సీనప్ప, వెంకటేష్, రాముడు, రాజశేఖర్, బసవరాజు, దుబ్బలింగ, ఎల్లాలింగా, చాగి బండ సర్పంచి ఓబులేసు, ఎంపిడిఒ ఆంథోని, తహశీల్దార్ మల్లికార్జున, ఎస్ఐ విజయ్ కుమార్, ఎపిఎం శివయ్య, ఎఇ లక్ష్మన్న, అగ్రికల్చర్ హనుమంతు, కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు.


పథకాల గురించి అడిగి తెలుసుకుంటున్న మంత్రి జయరాం

పాఠశాలకు స్థలం వితరణ

- మంత్రి జయరాం సోదరుల సమక్షంలో ప్రధానోపాధ్యాయునికి పత్రాల అందజేత

హొళగుంద : మండలంలోని ఎల్లార్తి జడ్‌పి కన్నడ ఉన్నత పాఠశాలకు 30 సెంట్ల స్థలాన్ని దాతలు విరాళంగా అందజేశారు. అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కబీర్‌కు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కబీర్ మాట్లాడారు. పాఠశాలకు 9 అదనపు గదులు మంజూరయ్యాయని, స్థలం లేక ఇబ్బంది పడ్డామని తెలిపారు. సర్పంచి కురువ చాముండేశ్వరి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఎల్లమ్మలు కలిసి 30 సెంట్ల స్థలాన్ని విరాళంగా అందజేశారని చెప్పారు. మంత్రి జయరాం దాతలను అభినందించారు. నాయకులు దర్గప్ప, ఎస్.కెగిరి, రంగస్వామి పాల్గొన్నారు.

న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- ఆలూరు బార్ అసోసియేషన్

ప్రజాశక్తి-ఆలూరు

కోర్టు నిమిత్తమై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి షేక్షావలీ, రవి డిమాండ్ చేశారు. బుధవారం బార్ అసోసియేషన్ ఆవరణలో వారు మాట్లాడారు. న్యాయవాది జి.షాకీర్ బాషా కోర్టు పని నిమిత్తమై ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఆలూరు పోలీసులు పరశురాముడు, నెల్లూరప్ప ద్విచక్ర వాహనాన్ని ఆపి న్యాయవాది పట్ల దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. దురుసుగా ప్రవర్తించి కించపరచి పోలీసులపై చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తీర్మానం చేసి నేడు విధులను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. వారిపై చర్యలు తీసుకొనే వరకు వివిధ రకాలుగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. న్యాయవాదులు వాయుజీవోత్తమరావు, ప్రవీణ్, లక్ష్మీకాంత్, రవి, మాధవ కృష్ణ, తిమ్మయ్య, కృష్ణకుమార్, విజయ్ భాస్కర్, చాంద్, ప్రసాద్, షాకీర్, రాజేష్ పాల్గొన్నారు.


మహాసభలో మాట్లాడుతున్న నాయకులు

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా

ప్రజాశక్తి-ఆలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా కోరారు. బుధవారం ఆలూరు ఎస్ఎఫ్ఐ 7వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం జూనియర్ కళాశాల ఆడిటోరియంలో సభ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పోతురాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్లా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 3, 4, 5వ తరగతుల విలీనం, రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల విభజనను రద్దు చేయాలని కోరారు. పాఠశాలలను యథావిధిగా కొనసాగించి రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 33,813 ప్రాథమిక పాఠశాలలు ముక్కలు కాబోతున్నాయని, దీని ద్వారా ఎక్కువ పేదలు నివసించే కాలనీలు, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చదువుకు దూరమవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు వినోద్, ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శులు గిరిమూర్తి, రవి, నరసింహ, మండల నాయకులు నరేంద్ర, నీలకంఠ నాయక్, ముని నాయక్, శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ జూనియర్ కళాశాల గర్ల్స్ కన్వీనర్ ఇందుశ్రీ, కోకన్వీనర్లు సుమలత, కావేరి, అనిత, సింధు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరుకుందలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో కార్తీక మాసం అమావాస్య రోజు భక్తుల కోలాహలంగా నెలకొంది. బుధవారం కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం రాత్రి నుంచి భక్తుల రద్దీ కొనసాగింది. శ్రావణమాసం ఉత్సవాల అనంతరం పుణ్యక్షేత్రంలో కార్తీకమాసం పూజలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులు తుంగభద్ర దిగువ కాలువలో స్నానాలు ఆచరించి ఈరన్న స్వామిని దర్శించుకున్నారు.

భక్తుల పాట్లు : బుధవారం సుమారు లక్ష మంది భక్తులు పుణ్యక్షేత్రానికి తరలిరావడంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. తలనీలాలు సమర్పించుకున్న భక్తులు స్నానాలు చేసేందుకు నీటి షవర్లు పని చేయకపోవడంతో తుంగభద్ర దిగువ కాలువకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రూ.కోట్లలో ఆదాయం ఉన్నా పుణ్యక్షేత్రంలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో భక్తులు అధికారులపై మండిపడ్డారు. కేవలం ఒక్కచోట తప్ప ఎక్కడా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో డబ్బులు పెట్టి నీటిని కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదునుగా భావించిన నీటి వ్యాపారులు ఒక బాటిల్ రూ.50లకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఇక ట్రాఫిక్ సమస్యలు అన్ని.. ఇన్ని కావు..! ప్రధాన రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్ద వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు కూడా ఇష్టానుసారంగా నిలపడంతో సమస్యలు ఏర్పడ్డాయి. వ్యాపార అంగళ్లు కూడా ఇష్టానుసారంగా వెలవడంతో భక్తులు ఎలా వెళ్లాలో తెలియక దిక్కులు చూస్తూ నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా దేవాలయాధికారులు భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని అవసరం ఉంది.


ఆలయ ఆవరణలో ఉన్న భక్తులు

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

నందవరం : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ తెలిపారు. బుధవారం నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో పాఠశాల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచుకుని, ఆలోచన విధానాలను మార్చుకొని సమాజాభివృద్ధికి మార్గదర్శకులు కావాలన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు రామలింగప్ప, సూర్యనారాయణ, సత్యన్న, జయన్న, వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు లచ్చప్ప, భోజరాజు, ప్రవీణ్ కుమార్, సూర్యనారాయణ శెట్టి, రాముడు, ఈరన్న, మేరీ, రంగమ్మ, విజయలక్ష్మి, నసీమున్నీసా, శాంతిమూర్తి, ధర్మన్న, ప్రమీల పాల్గొన్నారు.



పాత జాబితాకే గ్రీన్ సిగ్నల్

- అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి హైకోర్టు లైన్ క్లియర్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో చేపట్టిన అంగన్వాడీ సూపర్‌వైజర్ పోస్టుల నియామకాల్లో భారీగా అవకతవకలు చోటుకున్నట్లు ఆరోపణలు రావడంతో దానిపై మెరిట్ జాబితాలో పేర్లు లేని వారు, ఉన్న వారు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పాత మెరిట్ జాబితాకే హై కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో నియామకాలపై మళ్లీ ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

అంగన్వాడీల్లో గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టుల నియామకానికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన రాత పరీక్షను నిర్వహించారు. కర్నూలు జోనల్ వ్యాప్తంగా 216 పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయగా 5వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ పోస్టులకు సంబంధించి భారీగా అవకతవకలు చోటు చేసుకున్నట్లు తీవ్ర స్థాయిలో ఆరోపణలు రావడంతో తమకు అన్యాయం జరిగిందని మెరిట్ జాబితాలో పేరు లేని వారు, తమ పేర్లు మెరిట్ జాబితాలో ఉన్నందున తమకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇరు గ్రూపులూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు పాత జాబితాలో పేర్లు ఉన్న వారికే నియామకాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తీర్పు ఇచ్చింది. తాము ఎంపిక అయినప్పటికీ, మెరిట్ లిస్ట్ లో పేర్లు ఉన్నప్పటికీ ప్రక్రియను నిలిపివేశారని మెరిట్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. మెరిట్ అభ్యర్థుల తరపున న్యాయవాది నర్రా శ్రీనివాస్ కోర్టులో వాదనలు వినిపించారు. విచారణ జరిపిన ధర్మాసనం గతంలో జరిగిన ఎంపిక ప్రక్రియ ద్వారా ఎంపికైన అభ్యర్థుల జాబితాకు లైన్ క్లియర్ చేసింది. కాగా అంగన్వాడీ సూపర్ వైజర్ల పోస్టుల ఎంపికలో తమకు అన్యాయం జరిగిందని మరికొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అయితే వారి పిటిషన్‌లను కొట్టివేస్తూ పాత ప్రక్రియను కొనసాగించాలని హైకోర్టు న్యాయమూర్తి స్పష్టం చేశారు. పాత నోటిఫికేషన్ ప్రకారమే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు తెలియజేశారు. దీంతో తమకు మళ్లీ అన్యాయం జరుగుతోందని కొందరు అభ్యర్థుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

రూ.13.40 కోట్లతో అభివృద్ధి పనులు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణ సుందరీకరణలో భాగంగా రహదారి విస్తరణ పనులు చేపట్టామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాల్ సమీపంలో రూ. 13.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు అయిన నంద్యాల జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌ను అధిగమించేందుకు రహదారి విస్తరణ పనులు చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే ఇరుకుగా వున్న బొమ్మలసత్రం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని కర్నూలు-కడప నేషనల్ హైవే బొమ్మ సత్రం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు 2.5 కిలోమీటర్ల రోడ్డు పనులను రూ. 13.40తో చేపడుతున్నామన్నారు. రహదారిని విస్తరించి మధ్యలో డివైడర్‌తో పాటు రెండు సైడ్లు మురికి కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కలెక్టర్ కార్యాలయం ఉండడంతో అక్కడ ట్రాఫిక్ ఎక్కువ ఉండడం, ప్రజల రద్దీ పెరగడంతో రోడ్డు వెడల్పు చేపట్టామన్నారు. రోడ్లు పూర్తి అయితే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. స్థానికంగా నివాసమున్న నివాసితులకు ప్రత్యామ్నాయ నివాస స్థలాలు కూడా చూపించామని, వారికి నివాస పనులు త్వరగా పూర్తి చేయాలని, మధ్యలో బొగ్గలైన్ నివాసితులకు కూడా త్వరగా పూర్తి చేసి అందజేయాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, ఆర్అండ్‌బి ఎస్ఇ సురేష్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

నిధులు.. విధులు.. లేవు..

- అలంకారప్రాయంగా వివిధ కార్పొరేషన్ల చైర్మన్ల పదవులు
- కేవలం అధికారిక కార్యక్రమాలకే హాజరు

ప్రజాశక్తి - చాగలమర్రి

వాళ్లు పేరుకే రాష్ట్రస్థాయి కార్పొరేషన్లకు చైర్మన్లు. కానీ వారికి ఎలాంటి నిధులు.. విధులు లేవు. పదవులు చేపట్టి దాదాపు రెండేళ్లు పూర్తి అయిపోయాయి. మరి కొన్ని రోజుల్లో పదవి కాలం కూడా ముగిసిపోతుంది. వెనక్కి తిరిగి చూసుకుంటే వాళ్ల పరిపాలనలో సంబంధిత వర్గాలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. నెలకో.... రెండునెలలకో సిఎం జగన్ బటన్ నొక్కుడు కార్యక్రమం నిర్వహించే సమయంలో ఆ పోగ్రామ్‌లలో వీళ్లు హాజరు కావడం మినహా మరేమీ లేదు. ఒకరిద్దరూ ఈ పదవులను అడ్డం పెట్టుకుని ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి తమకు సంబంధించిన వాళ్ల పనులు చేయమని చెప్పడం వీరి విధిగా మారిపోయింది.

ఒకప్పుడు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కేబినెట్ ర్యాంకుతో సమానంగా ఉండేవి. ఎపిఎస్ఆర్‌టిసి, ఎపిఐఐసి, రాష్ట్ర గ్రంథాలయ, కాపు కార్పొరేషన్ వంటి పదవులను సీనియర్ నాయకులకు ఇచ్చేవారు. ఆయా సంస్థలకు నిధులు, విధులు రెండూ ఉండేవి. కొన్ని సంక్షేమ పథకాలు కూడా ఆయా కార్పొరేషన్ల ద్వారా అమలు జరిగేవి. టిడిపి హయాంలో కాపు కార్పొరేషన్‌కి దాదాపుగా రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌ని కేటాయించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో అయితే ఏపిఐఐసి ద్వారా పలు పారిశ్రామిక వాడలు ఏర్పాటు అయ్యాయి. కానీ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి ఎలాంటి నిధులు కేటాయించలేదు. జిల్లా నుంచి పలువురు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్, చైర్ పర్సన్ పదవులు పొందారు. నియామకం జరిగిన కొత్తలో సిఎం హామీ ఇచ్చిన విధంగా ఆయా కార్పొరేషన్లకు భారీగా నిధులు కేటాయిస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సంబంధిత సామాజిక వర్గీయులు కూడా తమకు సబ్సిడీపై రుణాలు, యంత్ర పరికరాలు అందుతాయని భావించారు. అలాగే ప్రత్యేకించి విద్యార్థులు ఉపకార వేతనాలు వస్తాయనుకున్నారు. దాంతో కార్పొరేషన్ల చైర్మన్లు ఎన్నికైన వారిని ఘనంగా గజమాలలతో సన్మానించారు. రోజులు గడిచే కొద్ది ఆయా చైర్మన్‌లకు ఎలాంటి నిధులు, పరిపాలన విధులను ప్రభుత్వం ఇవ్వలేదు. పైగా అందరికీ ఇస్తున్న అమ్మ ఒడి, విద్యా దీవెన, చేదోడు, చేయూత, వసతి దీవెన వంటి పథకాలు చూపిస్తూ వాటి ద్వారా మీ సామాజిక వర్గాలకు చెందిన వారికి కూడా లబ్ధి జరిగిందని చెప్పడంతో అందరూ విస్తుబోతున్నారు. పైకి చెప్పకపోయినా తమకు పదవి వచ్చింది కేవలం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి మాత్రమేనన్న విషయం తెలుసుకొని మదన పడుతున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి పొందిన ఒకరిద్దరూ మాత్రం ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం, వాహన ఇంధన ఖర్చులతో అడపా దడపా జిల్లాల పర్యటనలు చేస్తున్నారు. ఈ విధంగా జిల్లా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు పొందిన వారు ఉత్సవ విగ్రహాల వలే మారిపోయి పదవీకాలం గడువు ముగింపు తేదీ కోసం ఎదురుచూస్తూ గడుపుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- లైసెన్స్‌తో పాటు అన్ని సర్టిఫికెట్స్ తప్పనిసరి
- వాహనాలకు హై సెక్యూరిటీ నెంబర్‌ప్లేట్ అవసరం
- ప్రజాశక్తితో డోన్ ఎంవిఐ టి.క్రాంతి కుమార్



ప్రజాశక్తి-డోన్

'రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం, ఓవర్‌లోడ్‌తో వెళ్లడం, డ్రైవర్లకు సరయిన విశ్రాంతి లేకుండా వాహనాలను నడపడం, డ్రైవర్లకు పూర్తి అవగాహన లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. లైసెన్స్‌తో పాటు మిగతా ఉండాల్సిన సర్టిఫికెట్లు అన్ని ఉండాలి. లైసెన్స్‌కు చదువు అవసరం లేదు. 2014 తరువాత రోడ్డు మీదికి వచ్చే ప్రతి వాహనానికి హైసెక్యూరిటీ నెంబర్‌ప్లేట్ కలిగి ఉండాలి.' అని డోన్ మోటార్ వాహనాల తనిఖీ అధికారి టి. క్రాంతికుమార్ తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖి మాట్లాడారు.

మోటారు వాహన వినియోగదారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

ఎంవిఐ: లైసెన్స్ లేనివాళ్లు ఎక్కువగా ఉన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ చేయించుకోవాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఫర్మిట్, ట్యాక్సు, లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ చెకప్ చేయించుకున్నా సర్టిఫికెట్స్ తప్పక కలిగి ఉండాలి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు పై సర్టిఫికెట్లలో ఏది లేకపోయినా వాహనదారునికి, ప్రమాదం జరిగిన వాళ్లకు రావల్సిన బెనిఫిట్స్ నిలిచిపోయే అవకాశం ఉంది. 10 బండ్లలో ఎనిమిదింటికి ఈ సర్టిఫికెట్స్ గతంలో ఉండేవి కావు. అవగాహన కల్పించాక వాటిని 10 నుంచి రెండు బండ్ల వరకు తగ్గించాం.

లైసెన్స్ కోసం ఎంతవరకు చదువుకోవాలి?

ఎంవిఐ: లైసెన్స్ కోసం ఎలాంటి చదువు అవసరం లేదు. అది గతంలో చాలా మందికి తెలిసేది కాదు. దానిపై పూర్తి అవగాహన కల్పించాక చాలామంది వచ్చి లైసెన్స్ చేయించుకుంటున్నారు. ఆర్‌టిఓ ఆఫీస్‌లో లైసెన్స్ ఎలా తీసుకోవాలనే అంశంపై ఒక వీడియో తయారు చేసి యూటూబ్‌లో అప్‌లోడ్ చేశాక చాలా స్పందన వచ్చింది. కోటి 40 లక్షల మంది వీక్షకులు చూశారు.

హెవీ వెహికిల్ లైసెన్స్ తీసుకోవడం ఎలా..? ఏమేమి సర్టిఫికెట్స్ అవసరమవుతాయి..?

ఎంవిఐ. ముందుగా ఎల్ఎంవి వచ్చాక ఏడాది తరువాత ట్రాన్స్‌ఫోర్టు వెహికిల్ లైసెన్స్ ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం నిబంధనలను సవరించింది. ఎల్ఎల్ఆర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. దానికి పరీక్ష ఉండదు. ఆటోమేటిక్‌గా వస్తుంది. 30 రోజుల పాటు శిక్షణ పొందాలి. రోడ్డు భద్రతా నిబంధనలపై క్లాసులకు అటెండ్ కావాలి. గతంలో ట్రాన్స్‌పోర్టు బ్యాడ్జి నెంబర్ వచ్చాక హెవీ వెహికిల్ లైసెన్స్ ఇచ్చేవారు. దానిని మార్చారు. 7.50 టన్నులకంటే ఎక్కువ బరువు లాగే వాహనాలను హెవీ వెహికిల్‌గా పరిగణిస్తున్నారు.

రెన్యూవల్ ఎన్ని సంవత్సరాలకు ఒకసారి చేయించుకోవాలి..?

ఎంవిఐ: 40 యేళ్లలోపు వారికి ఎల్ఎంవికి 20 సంవత్సరాలకు ఒక సారి చేయించుకోవాలి. ఆపై వయస్సు వారి ఐదేళ్లకోసారి చేయించుకోవాలి. డాక్టర్ ఫిట్‌నెస్ సర్టిపికెట్ తప్పనిసరి అవసరం. హెవీ వెహికిల్‌కు ఐదేళ్లకోసారి రెన్యూవల్ చేయించుకోవాలి.

ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

ఎంవిఐ : రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి. ఓవర్‌లోడ్‌తో రోడ్డుమీదికి వెళ్లకూడదు. డ్రైవర్లకు సరయిన విశ్రాంతి లేకుండా వాహనాలను నడపరాదు. డ్రైవరకు పూర్తి అవగాహన లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి.. డ్రైవర్లు ప్రధానంగా అప్పుడప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలి.

వాహనాలకు ఎలాంటి నంబర్‌ప్లేట్స్ ఉండాలి..?

ఎంవిఐ: ప్రభుత్వం సూచించిన ఫాంటులోనే నెంబర్‌ప్లేట్‌పై లెటర్ ఉండాలి. నచ్చిన పేర్లు, దేవుని పేర్లు, అభిమాని పేరు, తల్లిదండ్రుల పేర్లు ఉండకూడదు. హైసెక్యూరిటీ నంబర్‌ప్లేట్ ఉండాలి. 2014 నుంచి ప్రతి ఒక్కరికి హైసెక్యూరిటీ నబంర్‌ప్లేట్స్ ఇస్తున్నారు. కర్ణాటక లాంటి చోట ప్రతి వెహికిల్‌కు హౌ సెక్యూరిటీ నంబర్‌ప్లేట్ ఉంటాయి. 2014కు ఉన్న వాహనాలకు అవసరం లేదు. వాళ్లు వీలయినంత తర్వగా హైసెక్యూరిటీ నంబర్‌ప్లేట్ వేయించుకోవాలి. అవికూడా పర్మనెంట్ రివిట్ ఫిక్స్‌డ్ నంబర్‌ప్లేట్ ఉండాలి. ఇరెగ్యులర్ నంబర్ ప్లేటు ఉన్న వాళ్లు రూ. 1000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాదాలు జరిగిన చోట విచారణలో పోలీస్‌లతో పాటు మీ ప్రమేయం ఉంటుందా..?

ఎంవిఐ: మేజర్ ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులతో కలిసి పరిశోధన చేస్తాం. ప్రమాదంలో మెకానికల్ డిఫెక్ట్ ఉందా లేదా అనే రిపోర్టు తయారు చేస్తాం. ఎక్కువగా చనిపోయిన ప్రదేశాలకు వెళ్లి స్పాట్ వెరిఫికేషన్ చేస్తాం. అవసరమైన నివేదిక ఇస్తాం.

మీరు ఈ ఉద్యోగంలోకి ఎప్పుడు వచ్చారు. ఎక్కడెక్కడ పని చేశారు..?

ఎంవిఐ : ఆటోమొబైల్ ఇంజనీరింగు డిప్లొమా అనంతపురంలో చదివాను. రైల్వే కోచింగ్ తీసుకున్నాను. లోకోఫైలెట్‌గా ఉద్యోగంలో చేరాను. చెన్నయ్, హైదరాబాద్, బెంగళూరు, గుంతకల్లు ఇలా రాసిన ప్రతి పోస్టుకు ఎంపికయ్యాను. గుంతకల్లులో చేరాను. ఉద్యోగం చేస్తూనే గ్రూప్-2 టెక్నికల్ ఉద్యోగం కోసం పరీక్ష పాసయ్యాను. 2012లో ఎఎంవిఐగా ఉద్యోగంలో చేరాను. హిందూపురం, రేణిగుంటలో చేశాను. ఎంవిఐగా ప్రమోషన్‌తో చిత్తూరుకు వెళ్లాను. అక్కడి నుంచి డోన్‌కు బదిలీపై వచ్చాను.

ఈ ఉద్యోగం సంతృప్తికరంగా ఉందా..?

ఎంవిఐ: వందశాతం సంతృప్తికరంగా ఉంది. అన్నింటికి మించి గుంతకల్లులో రైల్వేలో ఉద్యోగం చేస్తూ 15 మందికి ఉచితంగా కోచింగ్ ఇచ్చాను. వారంతా సెలక్ట్ అయి ఉద్యోగాల్లో చేరారు. ఇది నాకు ఎంతో సంతృప్తినిచ్చిన అంశం. నిబంధనలు పాటించని వాహన దారులతో జరిమానాలు విధించడం కంటే వారిని అవగాహన కల్పించడానికి ఎక్కువ ప్రధాన్యత ఇస్తాను. ఒకసారి అవగాహన కలిగితే ఎక్కువ తప్పులు చేయరని నా నమ్మకం. అలాగని ఉన్నతాధికారులు నిర్ధేశించిన టార్గెట్‌ను రీచ్ కావడంలో కూడా తగిన శ్రద్ధ వహిస్తాను.




ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ ఒ.ప్రభావతి

మెరుగైన వైద్య సేవలు అందించాలి : డిఐఒ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ప్రభుత్వ వైద్యశాలలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపట్టిందని నంద్యాల జిల్లా డిఐఒ డాక్టర్ ప్రభావతి పేర్కొన్నారు. బుధవారం బండి ఆత్మకూర్‌లోని 1వ సచివాలయంలో జరుగుతున్న 104 వైద్య సేవలు కార్యక్రమానికి ఆమె హాజరై గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. బండి ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రిలో త్వరలోనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ థియేటర్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఆరోగ్య సిబ్బంది నిరంతరం వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ భావన, ఎంపిహెచ్ఇఒ శివన్న, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **ఆత్మకూరు :** ప్రతి ఇంటికి వైద్య సేవలు అందించడంలో భాగంగా మండలంలోని వడ్ల రామాపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని కొట్టాల చెరువు పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో గర్భవతులు 39 మంది, బాలింతలు 42 మంది, టిబి వ్యాధిగ్రస్తులు 4, బెడ్ రీడన్‌లో 3, బిపి 43 మంది, షుగర్ 72 మంది, థైరాయిడ్ 8 మంది, బోధకాలు 12 మందిని గుర్తించారు. టిబి యూనిట్ సూపర్వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య, సిహెచ్ఓ జి రామ తులసి, ఏఎన్ఎం కరీమాబి, డిఇఓ రవి, ఫైలట్ రఫిక్, ఆశా కార్యకర్తలు ఎం చంద్రకళ, రాధమ్మ పాల్గొన్నారు

నేడు ఓంకారేశ్వర దేవస్థానం హుండీ కానుకలు లెక్కింపు

బండి ఆత్మకూర్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారేశ్వర స్వామి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నేడు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఆలయ అధికారి మోహన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ ఏ.విశ్వనాథరెడ్డి, ఆలయ ధర్మకర్తలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందంగా హాజరయ్యే అందరూ ఆహ్వానితులేని తెలిపారు.

26న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - సంజామల

సంజామల మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో విజయ్ కుమార్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు హాజరు కావాలని కోరారు.

మహిళలపై దాడులను అరికట్టడంలో పాలకులు వైఫల్యం

- 25 నుండి 'మహిళా హక్కులు-మానవ హక్కుల పరిరక్షణ' పక్షోత్సవ సదస్సులు
- ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.నిర్మల, బి.రజిత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను, హింసను అరికట్టడంలో పాలకుల వైఫల్యం చెందారని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.నిర్మల, బి.రజితలు విమర్శించారు. బుధవారం స్థానిక ఎన్‌జివోస్ కాలనీలో ఉన్న టి.నరసింహయ్య భవన్‌లోని ఐద్వా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిల భారత మహిళా సంఘం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'మహిళలపై జరుగుతున్న హింస, హరిస్తున్న మహిళా హక్కులు, మానవ హక్కుల పరిరక్షణ' అంశాలపై విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో నేటికీ మహిళలు హింసకు గురవుతూనే ఉన్నారని చెప్పారు. మహిళలపై అనేక రకాల దాడులు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. భారత రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు కల్పించిందని, వాటిని చిత్తశుద్ధితో అమలు చేయడంలో పాలకుల నిర్లక్ష్యం కనబడుతుందోని అన్నారు. రాష్ట్రంలో మద్యం విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతుండడం మహిళలపై హింసకు మరో ప్రధాన కారణమన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టి చర్యలు తీసుకోకపోగా మద్యాన్ని ఆదాయం వనరుగా చేసుకొని స్త్రీని వ్యాపార వస్తువుగా చేశారన్నారు. రాష్ట్రంలో దిశా చట్టాన్ని తెచ్చినప్పటికీ తూతూ మంత్రంగానే అమలు చేస్తున్నారని విమర్శించారు. హింసకు కారణమైన అసమానతలను అరికట్టి, సమాన అవకాశాలను మహిళలకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంటర్నెట్లో, ప్రసారమాధ్యమాల్లో వస్తున్న అశ్లీల చిత్రాలను నిషేధించాలని, మద్యాన్ని నియంత్రించాలని, గంజాయి మారకద్రవ్యాల అక్రమ వ్యాప్తిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25 నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు జరగనున్న 'హింస వ్యతిరేక, మహిళా, మానవ హక్కుల పరిరక్షణ' పక్షోత్సవాల సదస్సులను జయప్రదం చేయాలని కోరారు. డిసెంబర్ 9, 10 తేదీలలో విజయవాడలో జరగనున్న ఐద్వా 75 సంవత్సరాల వజ్రోత్సవ సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా నాయకురాళ్లు కె.దేవి, లక్ష్మి, బి.శివమ్మ, డి.శిరోమణి, షేక్ నూర్జహాన్, గుల్జార్ బీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.నిర్మల, బి.రజిత

25 నుండి రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని రామకృష్ణ పిజి కళాశాలలో ఉన్న శ్రీ కాశిరెడ్డి నాయన ఇండోర్ స్టేడియంలో కర్నూల్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ నిర్వహణలో ఈ నెల 25 నుండి 27వ తేదీ వరకు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు జరగనున్నాయి. బుధవారం స్థానిక క్రీడా సమాఖ్య కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ పోటీల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ఎపి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే పోటీలలో 25 జిల్లాల నుండి వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. బాలురకు అవసరమైన వసతి సౌకర్యం సమతా స్కూల్లో బాలచంద్రుడు ఏర్పాటు చేశారన్నారు. బాలికలకు ఎన్జీవోస్ కాలనీలోని సొసైటీ కళ్యాణమండపంలో వసతి ఏర్పాటు చేశారని చెప్పారు. ఓంకారం కాశిరెడ్డి నాయన ఆశ్రమం వారు భోజన వసతి కల్పిస్తున్నారని తెలిపారు. వివిధ వయసు కేటగిరీలు, వెయిట్ ఆధార కేటగిరిలలో పోటీలు నిర్వహించి విజేతలకు ఆదివారం సాయంత్రం ట్రోఫీలు, పతకాలు, యోగ్యత పత్రాలు అందజేస్తారన్నారు. 25న జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ పాషా, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా, ఆదివారం జరిగే బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ దస్తగిరి రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ తైక్వాండో క్రీడ ఒలింపిక్స్‌లో గుర్తింపు పొందిన క్రీడ అని తెలిపారు.



కర పత్రాలు విడుదల చేస్తున్న చంద్రమౌళి, డాక్టర్ రవికృష్ణ తదితరులు

పుల్లారెడ్డి చెరువు పంట కాలువలకు భూసేకరణ

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని ఎం.లింగాపురం గ్రామ శివారులో ఉన్న జి పుల్లారెడ్డి చెరువు నుంచి పంట కాలువల కోసం భూ సేకరణ పనులు చేపట్టినట్లు ఇరిగేషన్ ఏఈ డి.నాగన్న తెలిపారు. బుధవారం మండలంలో ఉన్న జి.పుల్లారెడ్డి చెరువు పంట కాలువల కోసం భూ సేకరణ సర్వే పనులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జి.పుల్లారెడ్డి చెరువు కుడి, ఎడమ తూముల నుంచి పంట కాలువల పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పనులు పూర్తయితే ఎం.లింగాపురం, గోకవరం, శివపురం గ్రామాల పరిధిలో దాదాపు 400 మంది రైతుల పొలాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. పంట కాలువల పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. సర్వే పనుల్లో ఏఈ శివ, విలేజ్ సర్వేయర్ అబ్దుల్, లస్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఎఇ

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి

- మండల విద్యాధికారి శ్రీధర్ రావు

అవుకు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని మండల విద్యాధికారి శ్రీధర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని మంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఏఈ చిన్న మదార్‌తో కలిసి ఎంఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రావు మాట్లాడుతూ పాఠశాలలో 60 లక్షల రూపాయలతో నాడు-నేడు పనులు జరుగుతున్నాయని, అందులో భాగంగా వాటర్ పైప్లైన్లు, టాయిలెట్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే నాలుగు అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, సిఆర్పి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

బేతంచెర్ల : ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన మోటార్ సైకిళ్లకు బేతంచెర్ల పోలీస్ స్టేషన్లో డిఎస్పి శ్రీనివాసరెడ్డి సమక్షంలో బుధవారం వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా 2 లక్షల 99 వేల 600 రూపాయలు ఆదాయం వచ్చినట్లు బేతంచెర్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ సి.ప్రియతం రెడ్డి తెలిపారు. ఈ వేలంలో 16 మోటార్ సైకిళ్లకు గాను 14 మోటార్ సైకిళ్లను రూ. 2 లక్షల 67 వేల 500కు పాట ద్వారా ఆదాయం, జీఎస్టీ ద్వారా 32 వేల 100 రూపాయలు వచ్చినట్లు సిఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ బాలాజీ సింగ్, కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు బాల మద్దయ్య, వేలం పాటదారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

నంద్యాల అర్బన్ : నంద్యాల పట్టణంలోని సాయిబాబా నగర్, ఎన్జీవోస్ కాలనీలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మునిసిపల్ డిఇ జయ భరత్ రెడ్డి, సంబంధిత వార్డు ఇంఛార్జి రహ్మతుల్లాతో కలిసి డ్రైన్స్ పైన వున్న ఆక్రమణలను పర్యవేక్షించి తగు సూచనలు ఇచ్చారు. అలాగే వార్డులో పక్కీర పేటలో జరుగుతున్న సిసి రోడ్, డ్రైన్ పనులను పర్యవేక్షించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం ఎన్‌జిఒ కాలనీలో కొత్తగా జరుగుతున్న గర్భజ్ ట్రాన్సర్ స్టేషన్ సాలిడ్ వేస్ట్ మానేజ్మెంట్ పనులను పరిశీలించారు. డిఇ మధు కుమార్, ఎఇ కళావతి తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్


భోజనం వడ్డిస్తున్న ఇఒ

శ్రీశైలంలో సాధువులకు అన్నదానం

శ్రీశైలం : కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలం క్షేత్రంలో సాధువులకు దేవస్థానం ద్వారా అన్నదాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్తీకమాసం ముగుస్తున్న సందర్భంగా క్షేత్ర పరిధిలోని మహిషాసుర మర్దిని ప్రాంగణంలోని సాధువులతో పాటు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన సాధువులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి లవన్న మాట్లాడుతూ క్షేత్ర పరిధిలోని పంచ మఠాల జీర్ణోద్ధరణ కార్యక్రమాలు పూర్తయిన వెంటనే సాధువులకు కలుపుతూ ఓ ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేసి భక్తులకు అనుకూలంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని వ్యాపారుల ఆందోళన

చాగలమర్రి : ఏటా వేలం పాటలు, పన్నుల రూపేన రూ.లక్షల్లో చెల్లిస్తూ వ్యాపారాలు చేస్తున్న తమకు మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు సరైన మౌళిక వసతులు కల్పించడం లేదంటూ కూరగాయల వ్యాపారులు బుధవారం ఆందోళన చేపట్టారు. స్థానిక సంత మార్కెట్లో వ్యాపారులు ప్రతి రోజు వ్యాపారం చేస్తున్న తమకు, మార్కెట్కు వచ్చే ప్రజలకు మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం లాంటి వసతులు కూడా లేవని కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులు షాబూవలి, ఖలీల్, అల్లావుద్దీన్, దాదాపీర్, సయ్యద్ బాష, మహబూబ్‌బాష, షంషీర్ తదితరులు వాపోయారు. కూరగాయల మార్కెట్ ఆవరణంలో పరిశుభ్రతను సక్రమంగా పాటించడం లేదని, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళిన ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కనీసం మౌళిక వసతులు కల్పించాలని మార్కెట్ వ్యాపారులు కోరుతున్నారు.

వైసిపి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : భూమా

నంద్యాల కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి పేర్కొన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్టంలో వైసిపి ప్రభుత్వం అందిస్తున్న పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను, కష్టాలను, వారి సమస్యలను తెలుసుకోవడానికి ప్రారంభించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం అందరికీ విదితమే. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం నంద్యాలలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్లో నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి అధ్యక్షతన టిడిపి నంద్యాల పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహించారు. టిడిపి నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొని మండల స్థాయి నాయకులకు, కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి, అలానే వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్తు మళ్ళీ చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి సిఎం చేసుకోవాలనే దానిపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

డోన్ నియోజకవర్గాన్ని వదిలిపెట్టం

- మీతోనే ప్రయాణం చేస్తాం : మాజీ మంత్రి కెఇ ప్రభాకర్

ప్రజాశక్తి - డోన్

తమకు రాజకీయంగా ఉన్నత స్థితి కల్పించిన డోన్ నియోజకవర్గం ప్రజలను వదులుకోమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ కెఇ ప్రభాకర్ ప్రకటించారు. బుధవారం పట్టణంలోని మధు ఫంక్షన్ హాల్లో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి.ఈ.కేశన్న గౌడ్, టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు కొట్రికే ఫణిరాజ్ తదితరులు ఆధ్వర్యంలో కెఇ ప్రభాకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కెఇ ప్రభాకర్ బర్త్ డే కేకును అభిమానుల సమక్షంలో కట్ చేశారు. ఈ సందర్భంగా కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ కెఈ కుటుంబానికి డోన్ నియోజకవర్గ ప్రజలతో ఎంతో అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ ప్రజల ప్రేమాభిమానాలు మరువలేనివని అన్నారు. చివరి వరకు మా ప్రయాణం డోన్ నియోజకవర్గ ప్రజలతోనే ఉంటుందన్నారు. ఏమి చేసినా నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనన్నారు. కేఈ కుటుంబం డోన్ నుంచి పోటీ చేస్తుందని, మీ వెంటే నడుస్తామన్నారు. అనుభవం లేని వాళ్లను ఎమ్మెల్యేలుగా నిలబెడితే మోయడానికి డోన్ నియోజకవర్గ కార్యకర్తలు, కెఇ అభిమానులు, ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఆరు నూరైనా డోన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ కేఈ కుటుంబం వదులుకోదన్నారు. అంతకుముందు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్, కెఇ మాదన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కెఇ ప్రభాకర్‌ను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి శేషఫణి గౌడ్, ప్యాపిలి మాజీ ఎంపిపి శ్రీనివాసులు, ఆర్.ఈ. నాగరాజు, కటారికొండ వెంకటేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి శ్రీరాములు, చంద్రపల్లె వెంకట రమణాచారి, పెద్దయ్య, శ్రీరాములు, ఆంజనేయులు గౌడ్, ఆలంకొండ నబీసాహెబ్, కెఇ.శ్యామ్, కొచ్చెరువు అశోక్, రేగటి రామ్మోహన్ రెడ్డి, చిట్యాల మద్దయ్య గౌడ్, చిట్యాల రఘు గౌడ్, ధర్మవరం సంజీవుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఇ ప్రభాకర్

ప్రశ్న పత్రాల రుసుం తగ్గించాలని డిఇఒకు వినతి

ప్రజాశక్తి - నంద్యాల

డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డిసిఇబి) తరపున ప్రశ్నా పత్రాలకు సంబంధించి పెంచిన రుసుమును తగ్గించాలని, గతేడాది మాదిరిగానే తీసుకోవాలని ఎపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) తరపున ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు దండే దస్తగిరి ప్రభుత్వాన్ని కోరారు. ఎపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు దండే దస్తగిరి ఆధ్వర్యంలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల గౌరవ అధ్యక్షులు బాలచంద్రుడు, కార్యదర్శి వాసుదేవా రెడ్డి, జిల్లా ట్రెజరర్ ఎంజేఫ్, ఎంజివి రవీంద్రనాథ్, బాల అకాడమీ, నంద్యాల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు బత్తిన వెంకటేశ్వర్లు తదితరులు డిఇఒ అనురాధను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దండే దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్రంలోని మిగతా జిల్లాలలో ప్రశ్నాపత్రాలకు సంబంధించిన ఫీజులు యధావిధిగా గత సంవత్సరం తీసుకున్న రుసుముల ప్రకారమే తీసుకుంటున్నారని తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో కూడా పెంచిన రుసుములు కాకుండా గత ఏడాది మాదిరిగా ప్రశ్నాపత్రాల ఫీజులు తీసుకోవాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన డిఇఒకు వారు అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు రవి కిండర్ గార్డెన్ పడకండ్ల సుబ్రహ్మణ్యం, క్యాంపస్ ఆరిఫ్, వైద్యం నాగేంద్ర, గుడ్ డే రసూల్, పాండే, న్యామతుల్లా తదితరులు పాల్గొన్నారు.


డిఇఒకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం


ఆళ్లగడ్డ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి

యాగంటి దేవస్థానంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

బనగానపల్లె : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర నాథ్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన ఎమ్మెల్యే గంగుల బిజేంద్ర నాథ్ రెడ్డికి ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, పూజారులు, సిబ్బంది పూర్ణకుంభాభిషేకంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేను ఆలయ చైర్మన్, పూజారులు ఘనంగా సత్కరించారు.

కమలాపురి పొలాల్లోకి ఎస్ఆర్‌బిసి నీరు

- పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన

సంజామల : మండలంలోని కమలాపురి గ్రామ రైతుల పొలాలలోకి ఎస్ఆర్‌బిసి 10వ కాలువ, 9వ మైనర్ నుండి నీళ్లు రావడంతో సుమారు 65 ఎకరాలలో శనగ, మినుము, మిరప పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులు అనిల్ కుమార్ రెడ్డి, విజయలక్ష్మి, శివప్రసాద్ రెడ్డి, కుమ్మరి వెంకటరాముడు, హనుమంత రెడ్డి, రవి కుమార్ రెడ్డి, గోవిందరెడ్డిలు మాట్లాడుతూ ఇప్పటికే ఈ కాలువ గుండా మూడుసార్లు నీరు వచ్చి పొలాల్లో పైర్లు దెబ్బతిన్నాయని, సుమారు ఎకరాకు 18 వేల రూపాయలు ఖర్చు పెట్టామని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ నీళ్లు రావడంతో కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, ఆత్మహత్యలే శరణ్యమంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీళు రాకుండా చూడాలని, ప్రభుత్వానికి తెలిపి నష్టపరిహారం వచ్చేలా చూడాలని రైతులు కోరారు.


పొలంలో చేరిన నీళ్లను చూపిస్తున్న రైతులు

తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు

పగిడ్యాల : తాగునీరు కలుషితం కాకుండా ప్రతేక చర్యలు తీసుకుంటున్నామని పగిడ్యాల పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సంకిరేణిపల్లేలో పైపులైన్ లీకేజీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పగిడ్యాల గ్రామా పంచాయితీ పరిధిలో మంచి నీటి పైపు లైన్లు లీకు కాకుండా, నీరు కలుషితం కాకుండా ప్రతేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సంకిరేణిపల్లె గ్రామ సమీపాన ఉన్న పగిడ్యాల గ్రామానికి మంచి నీరు సరఫరా చేసే బోరు పైపులైన్ పగిలి నీరు వృధా అవుతుందన్నారు. పైపులను మరమ్మతులు చేయించామన్నారు. బీరవోలు గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు పైపులు శిథిలమయ్యాయని, వాటికి తక్షణమే మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు. ఆంజనేయనగర్‌లో పైపులైన్ లీకై నీరు వృధాగా పోకుండా, కలుషితం కాకుండా మరమ్మతులు చేయిస్తున్నట్లు చెప్పారు. గ్రామ ప్రజలకు కలుషితం లేని నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు.


సంకిరేణిపల్లే వద్ద లీకైన పైపులను పరిశీలిస్తున్న కార్యదర్శి ఉపేంద్రరెడ్డి

మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి : ఆవాజ్

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఈ నెల 29న ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు అబూ బక్కర్ కోరారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని ముబారక్ షాదీఖానాలో ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు అబూబక్కర్ ఆధ్వర్యంలో వామపక్ష ప్రజా సంఘాలు, కుల సంఘాలు, వ్యాపార సంఘ నాయకులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ జకీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అబూ బక్కర్ మాట్లాడుతూ నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ గ్రామాలు, పట్టణం నుండి గర్భిణులు కాన్పు కోసం ఆసుపత్రికి వస్తుంటారని తెలిపారు. వచ్చిన వారిలో కొందరికి రక్తహీనత తక్కువగా ఉండటం వలన కాన్పు సమయంలో అవస్థలు పడుతూ, ప్రాణాలు కోల్పోతున్నారని డాక్టర్ రాయుడు, ఆవాజ్ కమిటీ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ నెల 29వ తేదీ నాటికి ఆవాజ్ కమిటీ ఆవిర్భవించి 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో చేస్తున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జవ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్, సిపిఎం నాయకులు వెంకటేశ్వర్లు, సిపిఐ రమేష్ బాబు, ఆర్టీసీ సంఘం నాయకులు ఎం.ఎం.బాషా, ఎమ్మార్పీఎస్ మార్కెట్ రాజు, ఫర్టిలైజర్ అసోసియేషన్ కార్యదర్శి అచ్చన్న, మాలమహానాడు నాయకులు జయరాములు, రాజు, చరణ్ తేజ, చౌడేశ్వరి సేవా సమితి నాయకులు దేశెట్టి శ్రీనివాసులు, వడ్డెర సంఘం నాయకులు చక్రి, రజక సంఘం జయన్న, ఫొటో వీడియో అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్, టైలర్స్ అసోసియేషన్ నాయకులు జయరాం, ఎస్సీ, ఎస్టి, ఎస్సీ సంఘం నాయకులు విజయ్, ఆవాజ్ కమిటీ నాయకులు అబ్దుల్ రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు అబూ బక్కర్

స్మశాల వాటికలను అభివృద్ధి చేయాలి : ఎంఆర్‌పిఎస్

బేతంచెర్ల : బేతంచెర్ల మండల కేంద్రంతో పాటు గ్రామాలలో ఉన్న దళితుల స్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎస్.మాధవ స్వామి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ముందు మండల నాయకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళిత కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే స్మశాన వాటికకు తీసుకెళ్తే స్థలం చాలక గతంలో పూడ్చిపెట్టిన శవాలను బయటకు తీసి అదే స్థలంలో పెట్టవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత స్మశాన వాటికలకు స్థలాలను కేటాయించా లని డిమా ండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో వెంగన్నకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

పగిడ్యాలలో అధికారులు విస్తృత పర్యటన

పగిడ్యాల : పగడ్యాల మండల కేంద్రంలో ఎంపిడిఒ వెంకటరమణ, ఇఒఆర్‌డి పుల్లయ్య, కార్యదర్శి ఉపేంద్రరెడ్డిలు బుధవారం విస్తృతంగా పర్యటించారు. కుంట వీధి, మైనార్టి కాలనీ, బస్టాండ్ ఏరియా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్త, మంచి నీటి పైపులైన్లు, గ్రామంలోని బావులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. మంచి నీటి పైపులు డ్రెయినేజీ కాల్వలలో, మురుగు నీటిలో ఉన్నాయని, పైపులను తొలగించాలని కార్యదర్శికి ఆదేశించారు. డ్రెయినేజి కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణంలో ఉన్న బావిని పరిశీలించారు. పశువుల బందలదొడ్డి వృదాగా ఉందని, ఏదైనా గోదాం నిర్మిస్తే గ్రామ పంచాయితీకి ఆదాయం వస్తుందని గ్రామ పెద్దలు అధికారులకు సూచించారు. అనంతరం వారు రైతు భరోసా కేంద్రాని తనిఖీ చేశారు.

రోడ్డు వేశారు.. మట్టి కుప్పలు మరిచారు..

నంద్యాల కలెక్టరేట్ : నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గుంతలు గుంతలుగా ఉన్న రోడ్డుకు మోక్షం లభించింది. ఎట్టకేలకు తారు రోడ్డు వేశారు. ఎంతో అందంగా ఉన్న తార్ రోడ్డు అందర్నీ ఆకర్షిస్తుంది. అయితే రోడ్డు వేయడానికి ఇరువైపులా ఉన్న దుమ్ము, మట్టిని తీసి ఫుట్ పాత్ వేశారు. ఆ మట్టి దుమ్మును ఇప్పటివరకు అధికారులు తీసివేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఆ దుమ్ము అంతా రోడ్డుపై పడితే రోడ్డంతా దుమ్ముగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ మట్టి కుప్పలను తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుకుతున్నారు.

గుండెపోటుతో వైసిపి నాయకుడు మృతి

నందికొట్కూరు : నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు సుబ్రమణ్యం మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, క్రీడా చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి బుధవారం దామగట్ల గ్రామానికి చేరుకొని సుబ్రమణ్యం మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆయన వెంట చంద్రమౌళి, ఎంపిపి మురళీకృష్ణ రెడ్డి, అయ్యపురెడ్డి, ఓంకార్ రెడ్డి, శ్రీదర్‌రెడ్డి, సలాం, ఉశేన్ మియ్యా, మాజీ సర్పంచ్ కృష్ణ, సుధాకర్, ఏసన్న, శైలజ, కాంతారెడ్డి, సురేష్, నాగార్జున, రిటైర్డు సిఐ రాముడు, బుజ్జి ఉన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్‌లో వడ్డేమాన్ ఘన విజయం

నందికొట్కూరు : కర్నూల్ ఎస్టిబిసి గ్రౌండ్‌లో బుధవారం ఆహా కిచెన్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిం చిన అంతర్ రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో వడ్డేమాన్ జట్టు విజయం సాధించింది. ఈ పోటీలలో దాదాపు అయిదు రాష్ట్రాల నుండి 74 జట్లు పోటీపడ్డాయి. ఇందులో గాయత్రి మిల్క్ వడ్డేమాను క్రికెట్ టీం అద్భుత ప్రదర్శన కనబరిచి ఫైనల్‌లో సూపర్ టౌన్ కర్నూల్ టీంపై 22 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదటి బహుమతి రూ.50,016ని కైవసం చేసుకుంది. ఈ విజయం పట్ల వడ్డేమాను క్రికెట్ టీం మేనేజర్ పవన్ కుమార్ రెడ్డికి ఆ గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.


కప్పుతో విజేత జట్టు

నాపరాతి సమస్యపై స్పందించని అధికారులు : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

నాపరాతి లీజుల సమస్యలపై అధికారులు స్పందించడం లేదని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి విమర్శించారు. బుధవారం నియోజకవర్గంలోని నాపరాతి లీజుదారుల సమస్యలపై నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గని యజమానుల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురాగా అధికారుల స్పందన నిర్లక్ష్యంగా ఉండటంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గని యజమానుల లీజులపై అధికారులు స్పందించడం లేదన్నారు. నాపరాతి పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉందని, అధికారులు, అధికార పార్టీ నాయకులకు, ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వారికి మాత్రమే రాయల్టీ బిల్లులు ఇస్తున్నారని విమర్శించారు. గని యజమానులందరికీ రాయల్టీ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. టిడిపి పాలనలో రాయల్టీ నాలుగు రూపాయల నుండి 8 రూపాయలకు పెంచితే గని యజమానుల సమస్యను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ఐదు రూపాయలకు తగ్గించామని చెప్పారు. డిఎంఎఫ్ 30 రూపాయలకు పెంచితే 15 రూపాయలకు తగ్గించామని తెలిపారు. వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, గని యజమానుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సిమెంట్ ఫ్యాక్టరీలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ లీజులు 50 సంవత్సరాలకు ఇస్తున్నారని విమర్శించారు. గని యజమానులకు మూడు సంవత్సరాలకు లీజు లీస్తూ, రెన్యువల్ చేయకుండా వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి నాపరాతి గని యజమానుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ఘనంగా నగర పంచాయతీ మొదటి వార్షికోత్సవం

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచెర్ల నగర పంచాయతీగా మారి ఏడాది పూర్తి అయిన సందర్భంగా మొదటి వార్షికోత్సవం వేడుకలను బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, నాగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు 70 కేజీల కేక్‌ను నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డితో కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ చలం రెడి, కౌన్సిలర్ కొమ్ము మధు, ముస్లిం మైనార్టీ జిల్లా కన్వీనర్ ముర్తుజావలి, గూని నాగరాజు తదితరులు మాట్లాడారు. బేతంచర్ల నగర పంచాయతీలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహాయ సహకారాలతో వీధి వీధినా మంచినీటి సౌకర్యం కోసం పైపులైను, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా డబుల్ రోడ్డు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు ఒక సంవత్సరంలోనే చేపట్టినట్లు తెలిపారు. ఇది గమనించని ఇతరులు నగర పంచాయతీలో అభివృద్ధి జరగడం లేదని కొందరు అనడం తగదన్నారు. నగర పంచాయతీలో అన్ని వర్గాల ప్రజల సౌకర్యాల కోసం సచివాలయాల భవనాలు, రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం చైర్మన్ చలం రెడ్డిని కౌన్సిలర్లు, ప్రజలు గజమాల, శాలువాలతో సత్కరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు ఇబ్రహీం, ముబీనా బేగం, కోట్ల మధు, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, అజాంబేగ్, దస్తగిరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


70 కేజీల భారీ కేక్‌ను కట్ చేస్తున్నచైర్మన్ చలం రెడ్డి తదితరులు

కౌరవ సభనా..? సిఎం సభనా..? : టిడిపి

చాగలమర్రి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి సభ కౌరవసభా లేక సిఎం సభా అన్నట్లుగా ఉందని టిడిపి రాష్ట్ర మైనార్టిసెల్ ఉపాధ్యక్షులు అన్సర్ భాష విమర్శించారు. బుధవారం చాగలమర్రిలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం సభకు మహిళలు వెలుతుంటే, వారిపై ఉండే నల్లటి చున్నీలను తీసేశారని, ఇది కౌరవసభనా అని విమర్శించారు. ముస్లిం మహిళలు సిఎం సభకు రావాలంటే బురఖా లేకుండా రావాలని చెప్పడం ముస్లీంల హజాన్నే అవమానపరిచడమన్నారు. ముస్లిం మైనార్టీలకు తీవ్రంగా అవమానపరిచేలా జగన్మోహన్‌రెడ్డి సభ జరిగిందన్నారు. ఆడపడచులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఒంటిపై ఉండే చున్నీలను లాగడం మంచి పద్ధతేనా అని అన్నారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తినరసింహులు, నంద్యాల బిసి సెల్ స్పోక్పర్సన్ సల్లానాగరాజు, నాయకులు మౌలాలి, హనీఫ్ , కొలిమి ఉసేన్వలి, షరీఫ్, జెట్టి నాగరాజు, సోనూ, గఫార్, కింగ్‌హుసేన్, మాబులాల్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను డిఎల్‌డిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని పలు గ్రామాల సచివాలయాలను డిఎల్‌డిఒ జనార్దన్ రావు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. అంతకుముందు కొలిమిగుండ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంను తనిఖీ చేశారు. అనంతరం ఆయన ఎంపిడిఒ సుబ్బరాజుతో కలిసి కొలిమిగుండ్ల-1,2, పెట్నికోట, కనకాద్రిపల్లి, బి.ఉప్పలూరు గ్రామ సచివాలయాలను పరిశీలించారు. బి.ఉప్పలురు గ్రామంలోని సచివాయంలో మొబైల్ ఆధార్ క్యాంప్‌ను తనిఖీ చేశారు. బయోమెట్రిక్ అటెండెన్స్, టెస్ట్ మొబైల్ వీడియోస్, డ్రెస్ కోడ్‌తో బ్యాడ్జి ధరించడం, స్పందన ఫిర్యాదులు పరిష్కరించడం, ఆయుష్మాన్ భారత్, మధ్యాహ్న భోజనంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుబ్బరాయుడు, రాఘవరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఖాశీం సాహెబ్, వెంకటేశ్, సుందరమ్మ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎల్‌డిఒ జనార్దన్ రావు

అన్నదానం ఎంతో సంతృప్తినిచ్చింది

- రామారం శ్రీశైలం గౌడ్

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ పుణ్యక్షేత్రం మహానందిలో కార్తీకమాసంలో నెల రోజులు పాటు భక్తులకు అన్నదానం చేయడం చాలా సంతృప్తిని, సంతోషాన్ని ఇచ్చిందని హైదరాబాద్‌లోని ముసాపేట మాజీ కౌన్సిలర్ రామారం శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా మహానందిలోని పోచ బ్రహ్మానంద రెడ్డి విశ్రాంతి భవనంలో మండల గౌడ అన్నదానం సత్రం అధ్యక్షుడు భానుముక్కల వెంకటరమణ గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిసి వెంకటేశ్వర్లు, రామకృష్ణుడు, సురేష్ గౌడ్, భాస్కర్ గౌడ్, పిక్కిలి తిమ్మయ్య, మధు, హరికృష్ణ, కిట్టు, చరణ్, కంపరాజు లక్ష్మీ నరసయ్య, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఇఒ సుభాన్ అన్నారు. బుధవారం మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడారు. ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం వల్ల విజ్ఞానం పెంపొందుతుందన్నారు. ప్రతి సబ్జెక్టు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. విద్యార్థులతో స్నేహ పూర్వకంగా మెలగాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం తూర్పు నెహ్రునగర్ గ్రామంలోని ఎంపిపి పాఠశాలకు వెళ్లి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకాని తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పికె ప్రాగటూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాని తనిఖీ చేశారు. కార్యమ్రంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే వైసిపి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూరు

నిరుపేద వర్గాలను అభివృద్ధి చేయడమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం.ఎ.రషీద్‌లను వార్డు కౌన్సిలర్ షఫీ ఉల్లా గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం వార్డు పరిధిలో ఇంటింటికి ఎమ్మెల్యే వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా వైసిపి ప్రభుత్వం ముందుకెళ్తుందని పేర్కొన్నారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ వైసిపి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

నందికొట్కూరు : వైసీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నా యని ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. నందికొట్కూరు మండలంలోని కోనేటమ్మ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అయితే ఎంపిపి మురళీకృష్ణా రెడ్డి, వైస్ ఎంపిపి జ్యోతి ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు కూడా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో మద్దూర్ హరి సర్వోత్తమ రెడ్డి, ఉదయ్ కిరణ్ రెడ్డి, ఈఓఆర్‌డి సుబ్రహ్మణ్యం, నాగటూరు సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో శోభారాణి, తహశీల్దార్ రాజశేఖర్ బాబు, టిడిపి సర్పంచి దామోదర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఉసేనయ్య, బొరెల్లి రఘు, తిరుపాలు, అచ్చన్న, కోళ్ల బావాపురం వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పండు, దామగట్ల రత్నం, మల్యాల శంకరయ్య, ముడియాల వెంకటరమణారెడ్డి, సుబ్బారెడ్డి, వేల్పుల నాగన్న, మాధవరం సంజన్న, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

నంద్యాల రూరల్ : నంద్యాల మండలంలోని పుసులూరు గ్రామంలో 60వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు తిరుగుతూ ఎమ్మెల్యే లబ్ధిదారులకు వివరిస్తూ, సంక్షేమ పథకాల బుక్ లెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్, ఎంపీడీవో భాస్కర్, గ్రామ సర్పంచి పాలుట్ల రాము, అడ్వకేట్ బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, ముక్కర సుదర్శన్ రెడ్డి, సూరజ్ రామిరెడ్డి, నాయకులు మహేశ్వరరెడ్డి, బసవేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అవ్వకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా